

# రాక్షసత్వం

శ్రీ కొంపెల్ల కామేశ్వరరావు

వీరడు దేశమంతా చెప్పుకునే అయిదవ జాతిలో పుట్టాడు. అతడు చాలా ఉత్తముడని చెప్పక తీరదు. తనకు ఓపినంతలో యితరులకు సహాయం చెయ్యాలని చూస్తాడు. దరిద్రదేవత నెత్తిపై తాండవమాడుతున్నా అబద్ధానికిగాని, దుర్వ్యసనానికి గాని దొంగతనమునకుగాని దిగబడే స్వభావము కాదతనిది. తన కున్నరోజున తిని, లేని రోజున పస్తుండేవాడు గాని ఆత్మగౌరవము చంపుకొని ఒకరిని అర్థించి యెరుగడు. భార్యసీతి కూడా భర్త కనుగుణ్యంగా వుంటూ యేవిషయంలోనైనా భర్తకు సహాయంగా వుంటూండేది. యీ సచ్చరిత్రులకు, 10, 6 సంవత్సరములు యీడుగల రాముడు, సుబ్బడు యిద్దరు పిల్లలు. వ్యవసాయమునకు ఒక కాడెడ్లు ఒక చిన్న పూరిల్లు, యిది వారి సంసారము.

వీరడు వెంకటదీక్షితులనే ఒక వడ్డీ వ్యాపారస్తుని భూమి నాలుగెకరాలు కవులుకు పుచ్చుకొని వ్యవసాయంచేస్తున్నాడు. తెల్లవారగట్టే లేచి పొలంలోకి వెళతాడు. జాము ప్రొద్దెక్కే సరికి కొడుకు తెచ్చిన గంజి అన్నము తిని, మళ్లీ పనిలో నిమగ్నుడై పోతాడు. మధ్యాహ్నం గంజికూడా అక్కడేత్రాగి రాత్రి 8 గంటలకు యిల్లుచేరటం.

సీతి తెల్లవారగట్లేలేచి వాకిలి గుడిసె శుభ్రముచేసుకొని, నీళ్లు తెచ్చుకొని, వంటచేసుకొని భర్తకు ముంతపంపి తానింత తిని పనిలోకి వెళ్ళి మధ్యాహ్నం కూలాళ్లంతా గంజికి లేచేవేళ తనుకూడ లేచి, వాళ్ళకంటె ముందుగానే గంజి

తాగి ఆ చెట్లుక్రింద పడియున్న చితుకులు యేరుకొని, యింతట్లో ఖామందు యెక్కడ తిడతారో అనే భయంతో పనిలో ప్రవేసించడం; సాయంత్రము 6గంటలకు యింటికి చేరుకోటం, నీళ్ళు తెచ్చుకోటం, అంతకి తంరోజు తెచ్చుకొన్న కూలిధాన్యం దంపుకొని అన్నం వండుకోటం, భర్తకు వేడి నీళ్లు కాచి, పిల్లలకు యింత అన్నం పెట్టి దంపతులు యింత తిని, రేపటి గతి యెట్లాగా అనే కలతతో కలత నిద్రపోవటం, ఉదయం మళ్లీ మామూలే.

వెంకట దీక్షితులుగారివద్ద రాముడిని గేదెను కాసే నిమిత్తం నెలకి 4 కుంచాల ధాన్యం జీతానికి పట్టేడు. యిది కుటుంబము యొక్క దినచర్య.

* * *

వెంకటదీక్షతులు సామాన్య వైదిక కుటుంబములో జన్మించాడు. పూర్వం అపరకార్యాలు చేయించడములో ఆరితేరిన ఘటం. అతన్ని ధనపిశాచము గట్టిగా పట్టుకొని బాధిస్తోంది. ధన విషయంలో అతడు యేకృూర కృత్యానికైనా పాపపు పనికైనా, హేయపు పనికైనా వెనుదీయని వీరుడు. ధనమే ప్రాణము, మానము. ధనము కొరకై భార్యా బిడ్డలనైనా బలి యివ్వగల సాహసుడు. భర్త యొక్క యీ ధనాకాంక్ష చేచేయుదురన్యాయములు, దుష్కార్యములు చూడలేకనే పాపము, ఆ యిల్లాలు యీలోకమును విడిచింది తన మురిపెంపు ముద్దు బిడ్డలను వదలి. ఆ ధనాశా పీడితుడు నిజము గ్రహించలేక యీ ధన రాసులు చూచుట కామె పెట్టిపుట్టలేదని భావించుకొని యెప్పటి లాగే వడ్డీలకు వడ్డీలు కట్టి, తాకట్టు సొమ్ములు వీలయినంతవరకు కైంకర్యము చేస్తూ, కాలదోషము పట్టిన (సాధారణంగా పట్టేనివ్వడు, కర్మవశాత్తు) ప్రోనోట్లు తారీకులను దిద్దుతూ, కమీషను బదుళ్లు యిస్తూ (అనగా రు. 100లు బదులు యిచ్చే దానికి రు90లు యిచ్చి 100లకు నోటు వ్రాయించుకొనుట) భూములు అయినకాడికి వ్రాయించుకొనుట, యింట్లో సరీగా తిండేనా తినక, పాపమనక, పుణ్యమనక ధనార్జన సాగిస్తూనే యున్నాడు. పేదరైతులకు, రు 10, రు 15లు బదుళ్ళు, రూపాయికి రోజుకు కానీ, అర్ధణాల చొప్పున వడ్డీ వేస్తూ, యెప్పటికప్పుడు వడ్డీ క్రింద యే నువ్వులో, పెసలో, మినుములో జమకట్టుకుంటూవచ్చి, చివరకు మామూలు బాకీచూపిస్తూ, బదుళ్లు యిచ్చినందుకు కూరలు వగైరాలు కమీషను పుచ్చుకొంటూ, తనే గొప్ప ప్రయోజకునివలె వెళ్లబుచ్చుతున్నాడు. తాను యెంతమంది నోటివద్ద కబళములు లాగుతున్నాడో, యెన్ని కొంపలను జప్తు చేయించి యెడ్పిస్తున్నాడో, యెంతమంది పేదప్రజలు తన మూలంగా మలమల మాడుతున్నారో గ్రహించడు.

## 2

"యీ యేడు దైవం రక్షించి యీ తోటకాయాలి" అన్నాడు వీరడు పెళ్ళాం సీతితో కలుపుతీస్తూ మిరపతోట్లో.

"అల్లాగే మరి యీయేడేనా కామందులికి అడక్కుండా సిస్తు చెల్లించాలి"

"మన కామందులు మంచివారే సుమా"

"అవును ఆ మారాజులు నిరుటి బకాయి 3 బస్తాలకి, ముంగటేడు బకాయి రెండు బస్తాలకి వడ్డీ కడుతున్నా కాపుదల చేసేరుకాదూ మరి" అంది సీతి వినిర్మల హృదయంతో.

"యీయేడు ఆ బకాయి తీర్చెయ్యాలి లేకపోతే మన గౌరవం దక్కదు."

"మొన్నచూశావూ పాపం యెంకడిని మనూళ్ళో పెద్దబేమ్మలు రెండేళ్ళ బకాయి యివ్వలేదని కోర్టులో దావాచేసి కొట్లో యేయించారు. గొప్పోరు యేపని చెయ్యటానికైనా దడవరు. ఆడిని అట్లా యేడి

పించి నందుకు ఆరికి పాపం రాదుట. ఆళ్ళు చేసిన పాపానికి యీ రూపంగా ఆళ్ళకి శిక్షట" అన్నాడు అమాయికంగా తనకి ముందు రాబోయే ముప్పును తెలిసి కోకుండా.

మన కామందులు పెద్ద కొడుకు పెద్దాపురంలో సాన్ని వుంచుకొన్నాడుట నిడమేనా? ఆరికి తప్పులేదు కాబోలు."

"ఆరు డబ్బున్న మా రాజులు. యేంచేస్తే తప్పుంది? మనం అల్లా అనకూడదు. మళ్లీ వారికి తెలిస్తే కోపమొస్తుంది"

"అరుగో మన బేమ్మలే కామోసు వస్తున్నారు. నేను వంకాయలు, పచ్చి మిరపకాయలు కోస్తూ వుంటాను. వారు పట్టించు కెళుతారు." అని కలుపుమాని కొయ్యటాని కెళుతుంది. "దండాలండి బాబూ. తమరు యింతదూరం నడచి వచ్చారే నన్ను రమ్మంటే రాకపోయేవాడినా మీ పాదాలదగ్గరకి" అన్నాడు నమ్రతతో.

"యేదో చల్లగావుందిగదా అని బయలుదేరాను. నీ వ్యవసాయం కూడా యెల్లా వుందో చూద్దామని" అన్నాడు తీవిగా దీక్షితులు,

"యేదో బాబూ తమ దయ వల్ల యింతవరకూ బాగానే వుందండి. దైవం రచ్చించి కాస్తే మీ బాకీ యీయేడు యెత్తేస్తాను బాబూ."

"బాగానే వుందిరా. యీడు యేమెల్లా లేదన్నా రెండెకరాలూ 5 పుట్ల మిరపకాయి తక్కువ కాదు. యీ రోజున నేను చెప్పేసనుకో స్వచ్ఛమైన బ్రాహ్మడిని" అన్నాడు మంచియేపుగా వున్న తోటమీద చూపు ప్రసరింప చేస్తూ.

"యేదో చిత్తంబాబూ తమ పేరు చెప్పుకొని బతకాలికదాండి యీ బీదకుటుంబం."

"యీ యేడు పరవాలేదురా! అన్నట్టు మరిచిపోయేను రెండేళ్ళ నుంచి వున్న బకాయికి నోటు వ్రాయించి తెచ్చాను. దీనిమీద వేలుమోరు వెయ్యి"

"చిత్తం ప్రభువులు యిప్పుడు దీనికి నోటెందుకండి బాబూ యింక మూడునెల్ల నాటికి మిరపకాయ వస్తుంది అప్పుడు యేకంగా చెల్లెట్టేస్తాను బాబూ" అన్నాడు జాలి గొలుపుతూ.

"అబ్బే నువ్వు యివ్వవని, నీ దగ్గర బాకీ పోతుందని కాదురా. అల్లా అయితే నిన్నునమ్మి భూమే యియ్యక పోదును. యిది వ్యవహారధర్మం. రేపు యిన్‌కంటాక్సు లెక్కల్లో చేర్చి చూపించాలి"

"చిత్తంబాబూ రచ్చించినా తమరే బచ్చించినా తమరే తమ బిడ్డలవంటివోళ్ళం బాబూ"

"మరేం పరవాలేదురా. నేను నీమీద దావాచేస్తానా! నీకా అనుమానం యెందుక్కలగాలనీ నామీద"

"చమించండి బాబూ, అంత మాటే యేదో మూడునెల్లల్లో తీర్చుకుంటాంగదా అని చెప్పేనండి బాబు; యిల్లా యియ్యండిబాబు యేసియిస్తా"నని నోటందుకొని రు50లకు వ్రాసిన నోటుమీద వేలిముద్రవేశాడు అది యెంతకి వ్రాసిందీ యేవడ్డీ వేసిందీకూడా తెలియకండా. ఆహా! వాళ్ళ జీవితమెంత నిర్మలమైన, నిష్కలంకమైనదో! తనచేత అక్రమంగా రు 50లకు నోటు వ్రాయించుకొంటున్నాడన్న అనుమానమేనా లేదా నిర్మలాత్మునికి. బాకీయున్న దానికి వ్రాయించుకొన్నా డనుకొన్నాడా కష్టజీవి.

"ఒరే నే నెడతాను పొద్దు పోయింది, వంకాయలేమేనా వున్నాయా?"

"చిత్తం బాబు తమరికోసమే అది కోస్తోంది."

యింతట్లో సీతి కొన్ని వంకాయలు, పచ్చిమిరపకాయలు, ఒక ఆనపగాయ తెచ్చి అక్కడ పెట్టింది."

"యేమే సీతీ, గుమ్మిడికాయ యేమీ లేదూ. వుంటే

చూసి రేపు వూళ్ళోకిపంపుతే, వెళతాడు."

"సిత్తం బాబు"

యీ సంవత్సరం తోట బాగుంది కదా, యీ సంవర్సరం శిస్తూ, బకాయికని వంకపెట్టి వ్రాయించిన రు50. ప్రోనోటూ యీ సంవంత్సరం వసూలు చెయ్యవచ్చు గదా అనే సంతోషంతో వెళ్ళిపోయాడు దీక్షతులు.

యీ సంవత్సరము తోట బాగా వుంది కదా, యిదివరలో బకాయి, యీ సంవస్సరం శిస్తు తీరిపోగా కొంచెం మిగలవచ్చుగదాయని సంతోష పడ్డారా పేద దంపతులు.

## 3

కాలము మారిపోయింది. వీరడు సీతి సంతోషపడ్డ రోజులన్నీ గతించాయి. వీరడి రోజులు బాగులేకనో, దీక్షితులు యొక్క విషపు దృష్టి వల్లనో యేపుగా పెరిగిన మిరపతోట దిగనారకా నారంభించింది. మాలపల్లెలోవుండే అనారోగ్యం వల్లనేమి వీరడు కష్టాలు యినుముడించటం కోసమైతేనేమి వీరడు కొడుకు సుబ్బడికి జబ్బుచేసింది. వాడు మంచం మీదనుంచి లేవటం లేదు. తల్లి, కొడుకుని వదలి ఒక్క నిముసముండటానికి వీల్లేదు. రాముడు తన పనిలోనుంచి సూర్యుడు పడమటి దిక్కున ఉదయించినా ఒక్క రోజైనా మానగూడదు.

తోట చీడపట్టి పాడైపోవుట, యింట్లో పరిసితులు బాగులేక పోవుటచేత ఆ దంపతుల యొక్క ఆశాలత ఒక్కసారిగా మాడిపోయింది. యింట్లో గంజిగడిచే యెత్తులేదు. మిరపతోట 5 పుట్లు అవుతుందనుకొన్నది 1¼పుట్టి ఆయే సరికి బ్రహ్మాండమైంది. మిరపకాయి అంతా దీక్షితులు యింటి పంపినాడు.

వెంకట దీక్షితులు మిరపకాయ వచ్చేసరికి వారంటు అమలు జరపటానికి రు 50లకు నోటిదావాచేసి, సమనులు వగైరాలు వీరడికి అందకుండాచేసి కోర్టులో డిక్రిపొందాడు.

పాపం! వెంకట దీక్షితులు యొక్క యీకృార కార్యనిర్వహణం వీరడికేమి తెలుస్తుంది. యింకా వారికి యీ సంవత్సరము తన పరిసితులు తెలియపర్చి యేమైనా సహాయం పొందుదామనుకొన్నాడా అమాయకుడు.

## 4

ఉదయం తొమ్మిదిగంట లవుతుంది. వీరడు పొలంలో దూడలను సవరించుకొని ముంతతెచ్చే సుబ్బడు మంచాన పడ్డంచేత యింటికి వచ్చాడు గంజితాగడానికి.

"బాబా నన్ను మిరపతోట్లో ఆడుకోనియ్యవూ?" అని కలవరించాడు మంచము మీదున్న సుబ్బడు.

పాపం! యీ మాటలువిని మిరపతోట మొదటిలో వుండే అందమూ, అప్పటివాళ్ల సంతోషం అంతా జ్ఞప్తికి తెచ్చుకొని ఆ దంపతు లిద్దరు వేడికన్నీటి బిందువులు రాల్చి కుర్రవానిని సంతోష పెట్టడానికి "చిట్టిబాబూ, నీకు వంట్లో బాగున్నాక మన బేమ్మలింటికి తీసికెళ్లి మంచి పప్పన్నం పెట్టిస్తాను బాబూ" అని వోదార్చారు.

యీ పరిసితులన్నీ వీరని యొక్క బలము, సాహసము, మొదలైనవాటి సన్నిటిని నశింపజేశాయి. వీరడు గంజిముంత ముందుపెట్టుకొని విచారము చేత గంజినోటికి పోక తనలోతాను యొక్కతన నికృష్ట బానిస జీవితమును,ముందు రాబోవు కష్టజీతము తలుచుకొంటూ, జబ్బుతోవున్న కుర్రవానినైనా చూచుకొనుటకు కూడ స్వతంత్రములేక యున్న వ్యర్థ జీవితమును తర్కించుకొంటున్నాడు.

యింతట్లో ప్రత్యక్షమైనాడు దీక్షితులు వారంటు బంట్రోతుతో యమకింకరుడిలాగ. అమాయికుడైన వీరడికి యీ సంగతి తెలియదు పాపం. దీక్షితులుగారు తన పిల్లవాడికి జబ్బుచేసిందని యోగక్షేమం తెలిసికొనడానికి వచ్చాడనుకొన్నాడు కాని కాలసర్పంలా తన్నుకరుమటకు వస్తున్నాడనుకోలేదు.

"దండాలండి బాబూ. యీయాలకి వారం రోజులనుంచి కిందమీదగా వున్నాడండి మా సుబ్బడు. అంచేతే నేను తమ దరిశనానికి రాలేక పోయానండి. బాబు"

"వాడే వీరడు, బాకీదారు" అని వీరడి మాటలు వినిపించుకోనట్లు వారంటు బంట్రోతుతో చెప్పాడు దీక్షితులు,

"ఒరే వీరిగా, నీమీద యీ దీక్షితులు గారు రు 60లకు నోటు

డిక్రీ పొందారు. బాకీ యిప్పుడు యిస్తావా కోర్టుకి నడుస్తావా" అన్నాడా వారంటు బంట్రోతు అధికార సూచకంగా.

"యేమిటండి బాబూ. నేనా నేనా ఆరికి రు 60లు బాకీ" అని తెల్ల బోయేడు వీరడు.

"యేమీ అల్లా తెల్లపోతా వెందుకు యేమీ యెరగనట్టు గాడిదా! బకాయికి అప్పుడు నువ్వు వ్రాయించి యిచ్చిననోటు" అన్నాడు నిస్సంశయముగా.

"బాబూ తెలియనోణ్ణిచేసి నా చేత అక్రమంగా నోటుమీద వేలు మోరేయించు కున్నారా? నేను మీకు నిజంగా యియ్యవలసిన బకాయి 5 బస్తాలు, దానికి యింత అక్రమంగా రాయించుకుంటారా" అన్నాడు దీనంగా.

"అరే ఆట్టేపేలకు, అక్రమం గిక్రమం అని. నీవు స్వయంగా వ్రాయించి యిచ్చినదానికి అక్రమమా! యేం పొగరుగావుంది మీ మాలాళ్లపని! వెధవ కాంగ్రెస్సంటూ వచ్చి మిమ్మల్ని మితిమీర బెట్టింది. కుటుంబీకుడివిగదాఅని దయదలచి బకాయి కాపుచేయిస్తే యిదా నువ్వు చెప్పే సమాధానం? పట్టుకోవోయి! జైల్లో కూర్చుంటే అప్పుడే వస్తాయి రూపాయిలు" అన్నాడు గంభీరంగా.

యీమాటలతో వీరడు నిర్విణ్ణుడై యింకా గంజి అయినాతాగని ఆకలిమంటచేతను, తన ముద్దు బిడ్డడు నేడో రేపో చనిపోతా డన్న ఆవేదంతోను,యిప్పుడు తను జైల్లోకి వెడితే సీతి కొడుకు మీద బెంగచేతా, భర్త జైల్లో పడ్డాడనే బెంటచేత నిద్రాహారాలు మాని చనిపోతుందేమో దానితో కుటుంబనాశన మెల్లాగా అవుతుందన, కనికరమైనా లేకుండా నిర్దాక్షిణ్యంగా, ధనకాంక్షచే, తన కుటుంబ నాశనమునకు తలపడిన యీవిష క్రిమిని తుదముట్టిస్తే అనేక మావంటి బీద కుటుంబాలను రక్షించినవాణ్ణి ఔతానో యీ వృత్తిలో పేద రైతుల ప్రాణాలుతీసే రాక్షసులకు హడలుగా వుంటుందనో, యీ తుచ్ఛ జీవితము, యీ బానిసత్వముతో అంతరించే కంటే యీ విధంగా వీడిని కడతేరిస్తే బాగుంటుందనో, మరే మనుకొనో లేచి బలము, సంతోషము తెచ్చుకొని చప్పున యింటిలోకి పోయి కర్రతీసుకొనివచ్చి దీక్షితులు నెత్తిపై పెట్టగానే దీక్షితులు క్రిందపడిపోయాడు. యీ దృశ్యం చూస్తూన్న సీతి నిర్విణ్ణ ఐపోయింది.

దీక్షితులను వీరడు కొట్టిన నాటి సాయంత్రానికి పోలీసులు వచ్చి వీరడిని జైలుకు తీసుకుపోయారు. భర్తను యీవిధంగా అక్రమంగా తీసుకొని పోవుటకు కారకుడైన దీక్షితులు కఠినత్వానికి సీతి చాలా విచారించింది. రాత్రి యీవిచారంలో వుండగానే సుబ్బడు యీ ప్రపంచాన్ని విడచిపెట్టాడు. సీతికి విలపించింది. చూచే దిక్కెవ్వరు! సీతి మనస్సులో ఒక దృఢ నిశ్చయం చేసుకొని, తన పెద్దకొడుకు నిద్రిస్తూన్న పక్క దగ్గరకు పోయి రెండు కన్నీటి బిందువులు వదలి చనిపోయిన సుబ్బడిని బుజాన వేసికొని ఆ రాత్రి యెచ్చటికో వెళ్ళిపోయింది.

మరునాడు ఉదయం రాముడు లేచు సరికి తల్లి తమ్ముడు కనబడలేదు. రాముడు భయపడి ఊరంతా వెతికాడు. ప్రతి వ్యక్తిని అడిగాడు. యెపరో సీతి శవము,సుబ్బడి శవము గోదావరిలో వున్నాయని చెప్పేరు. అక్కడకు వెళ్లి అనేక విధాల యేడ్చాడు. ఆ కుర్రవాని యేడ్పు వినేదెవరు! గ్రామ మునసబు మున్నగువారు పంచాయితీచేసి భర్తను జైల్లో వేశారన్న విచారంతో పిల్లవాడిని గోదావరిలో పారవేసి తనుకూడ పండిదన్నారు.

వీరడిని మేజస్ట్రీటు విచారణ చేసిహత్య చేయుటకు ప్రయత్నించినందులకు 20 సంవత్సరాలు ద్వీపాంతరవాస శిక్ష విధించారు. వీరడికి డబ్బు లేకపోవటం చాత తనయందు తప్పులేదని వాదించుకొనుటకు అవకాశము కలుగలేదు.

దీక్షితులకు దెబ్బ నయమై మామూలు కృత్యాలను యింకా వృద్ధి పొందిస్తూ, వీరడి పొగ గణిగింది గదా యని సంతోషిస్తూ కాలం గడుపుతున్నాడు.

రాముడికి పిచ్చెత్తి వీధులంట తిరుగుతున్నాడు. దయవున్నవాళ్లు రెండు మెతుకులు పెడుతున్నారు. లేనప్పుడు పస్తుంటున్నాడు. ప్రతి రోజు దీక్షితులు యింటికేసిచూస్తూ యేమో వెర్రిగా అంటాడు. వాళ్ల జీర్ణకుటీరానికి వెళ్ళి కూర్చుంటాడు. గోదావరియొడ్డున తల్లిని, తమ్ముని పాతిననోట నిద్రిస్తాడు.